
## మోసగించిన మాజీమంత్రి మల్లారెడ్డి..

# డబ్బు ఇప్పించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి వృద్ధరైతు విజ్ఞప్తి



బౌన్స్ అయిన చెక్కును చూపిస్తున్న కల్లెం నర్సింహారెడ్డి

హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 14, ప్రభాతవార్త: నిత్యం వివాదాల్లో ఉంటున్న మాజీమంత్రి చామకూర మల్లారెడ్డి తనకు బంధువు అని చెప్పి భూమిని కొనుగోలు చేసి డబ్బు చెలించకుండా మోసం చేశారని ఓ వృద్ధ రైతు (87) ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని ఆ రైతు విజ్ఞప్తి చేశారు. అమెరి కాలో 30 యేళ్లపాటు 5వేల ఎకరాలు భూమిని సాగుచేసి అమెరికా అధ్యక్షుడు జిమ్మికార్టర్‌తో ఉత్తమ భారతీయ రైతుగా సత్కారం పొంది, ప్రస్తుతం దోమల్‌గూడలో నివాసం ఉంటున్న కల్లెం నర్సింహారెడ్డి గురు వారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 1987లో తాను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలం యాడారంలోని సర్వే నెంబర్లు 249, 250ఎలో 23 ఎకరాల 26 గుంటల భూమిని కొనుగోలు చేశానన్నారు. కాగా ఈ భూమిని తాను కొనుగోలు చేస్తానని మల్లారెడ్డి బంధువుల ద్వారా పలు మార్లు తనని అడిగారని అన్నారు. ఒక్కో ఎకరానికి రూ. 2.25 కోట్ల చొప్పున 9.29 ఎకరాల భూమికి 21.88 కోట్లు చెల్లిస్తానని ఒప్పందం చేసుకున్నామని, ఇందుకు సంబంధించి తామిద్దరం అగ్రిమెంట్ చేసుకు న్నామని ఆయన తెలిపారు. ఈ భూమిని మల్లారెడ్డి తన అల్లుడు సంతోష్‌రెడ్డికి సంబం ధించిన కంపెనీ మహేంద్ర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుమీద గత జూన్ నెలలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పలు విడతలుగా రూ. 8.3 కోట్లు చెల్లించారని నర్సింహారెడ్డి వివరించారు. మిగిలిన డబ్బు 14 కోట్ల రూపాయలకు ఆ కంపెనీ పేరుమీద చెక్కులు ఇచ్చారని, ఆ చెక్కులు బ్యాంక్‌లో బౌన్స్ అయ్యాయని ఆరోపించారు. ఈ విషయంపై 40 రోజులుగా పలుమార్లు మల్లారెడ్డికి చెప్పినా పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరైన బిఆర్ఎస్

### మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 14: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, నకరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విచారణకు హాజరయ్యారు. ఇప్పటి వరకు పోలీసుల చుట్టే తిరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మూడు రోజుల క్రితం పోలీసులు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే గురువారం జూబ్లీహిల్స్ లోని ఏసీపీ కార్యాలయానికి వచ్చిన చిరుమర్తి లింగయ్య నుంచి పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఫోరెన్సిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నుంచి తాజా ఆధారాలు వెల్లడైన నేపథ్యంలో, పోలీసులు ఆ కోణంలో చిరుమర్తి లింగయ్యను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. విచారణకు హాజరయిన అనంతరం మీడియాతో మాట్లాడారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పినట్లు తెలిపారు. ఈనెల 9న తనకు నోటీసులు ఇచ్చారని, పోలీసులు చిన్న విషయాన్నీ పెద్దగా చూస్తున్నారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌తో తనకు సంబంధం లేదని అన్నారు.

తనకు తెలిసిన అధికారి అయినందున తాను గతంలో అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఓ కేసులో మదన్ రెడ్డి, రాజ్ కుమార్ ఫోన్ నంబర్లు తిరుపతన్న అడిగారని, వారి ఇద్దరు ఫోన్ నంబర్స్ తన అనుచరులతో తీసుకొని అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకి ఇచ్చినట్లు చెప్పుకొచ్చారు. అదేవిధంగా ప్రచార సమయంలో అదనపు ఎస్పీ (సస్పెండెడ్) తిరుపతన్నతో మాట్లాడిన మాట వాస్తవమని తెలిపారు. అంతేకానీ ఫోన్ ట్యాపింగ్‌తో తనకు ఎటువంటి సంబంధం లేదని వివరించినట్లు పేర్కొన్నారు. పోలీసులు వాళ్ల దగ్గర ఉన్న ఆధారాలతో తనను పిలిచి విచారించారని, తాను సమాధానం చెప్పానన్నారు.

**పోలీసులు ఎప్పుడు పిలిచినా విచారణకు సహకరిస్తా : లింగమయ్య**

ఈ కేసులో ఎప్పుడు విచారానికి పిలిచినా తాను పోలీసులకు సహకరిస్తానని చెప్పుకొచ్చారు. అంతకముందు తెలంగాణ భవన్‌కు చేరుకున్న చిరుమర్తి లింగమయ్య, ఎమ్మెల్యేగా పనిచేసిన తనకు పలువురు అధికారులతో పరిచయాలు ఉంటాయని, మాట్లాడుతుంటానని అందులో తప్పేమీ ఉందని ప్రశ్నించారు. నోటీసులతో బెదిరించి తన గొంతు నొక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అది ఎప్పటికీ నెరవేరదన్నారు.

### బేగంపేట వరుణ్‌షోరూంలో వినియోగదారుడికి సెడాన్ డెలివరీ

# కట్టింగ్ ఎడ్జ్‌సేఫ్టీ సాంకేతికతో కొత్త డిజైర్ సెడాన్

హైదరాబాద్, నవంబరు 14,ప్రభాతవార్త: వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ డీలరు షోరూం లో భారతదేశపు ప్రముఖ మారుతీ సుజుకి రూపొందించిన ఆరు ఏయిర్ బ్యాగుల భద్రతతో కూడిన అత్యంత అధునాతన 'ది ఆల్ న్యూ డిజైర్' మొదటి కారును ఆవిష్కరించి, వినియోగ దారులకు విడుదల చేసింది. బేగంపేట షోరూమ్‌లో గురువారం ముఖ్య అతిథిగా ఎస్‌బిఐ (ఎల్‌హెచ్ఓ కోటి) డిజిఎం కస్తూరి వినోద్ సమక్షంలో "ది ఆల్ న్యూ డిజైర్"ని ఆవిష్కరిం చారు. డిజైర్ ధర రూ. 6.79లక్షల నుంచి మొదల వుతుంది. ఈ కార్యక్రమంలో వరుణ్ మోటా ర్స్ జిఎం కృష్ణకుమార్కే, డిజిఎం రామ్‌కుమార్, సుమంత్ ఎస్ఎం ఇతర వరుణ్ మో టార్స్ సిబ్బంది పాల్గొన్నారు. ఆల్‌న్యూ డిజైర్‌ను పరిచయం చేస్తూ, డిజైన్ మరియు ఖరీదైన ఇంటీరియర్స్‌తో డిజైర్ ఆధునిక ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. అధునాతన జెడ్ సిరీస్ ఇంజన్ ఉండటంతో ఇందనం గరిష్ఠ వినియోగం చేయడమే కాకుండా వాతావరణ కాలుష్యం, ఆర్థికభారం కూడా తగ్గిస్తుంది. ప్రోగ్రెస్సివ్ డిజైన్ కలిగిన న్యూ డిజైర్ స్పష్టమైన రహదారి ఉనికిని తెలియజేస్తుంది. సొగసైన సిల్హౌట్ దాని విజువల్ అప్పీల్‌ని పెంచడమే కాకుండా విశేషమైన ఏరోడైనమిక్ ఎఫిషియన్సీకి దోహదపడుతుంది. డిజైర్‌లో లభించే మరో సెగ్మెంట్‌మొదటి ఫీచర్ 360 హెచ్ డి వ్యూ కెమెరా ఉంది . రియల్ టైమ్ వెహికల్ ట్రాకింగ్, రిమోట్ ఫంక్షనాలిటీని అందిస్తుంది. డిజైర్ మెరుగైన భద్రత, అదనపు సౌలభ్యం కోసం టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ ని కూడా అందిస్తుంది. సెగ్మెంట్‌లీడింగ్ 22.86 సె.మి (9") స్మార్ట్‌ప్లే ప్రో+ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ అతుకులు లేని కనెక్టివిటీని అందిస్తోంది. అదనంగా ఇందులో క్రూయిస్ కంట్రోల్, యుఎస్ బి ఫాస్ట్ ఛార్జర్, 10.66సె.మి (4.2") కలర్డ్ ఎం ఐ డి , వెనుక ఎ సి వెంట్స్, రియర్ ఆర్మ్‌రెస్ట్, ఆటోమేటిక్ ఎయిర్ కండిషనింగ్ మరియు కీలెస్ ఎంట్రీ ఉన్నాయి,




# దేవాలయాలకు కార్తిక శోభ

### సామూహిక కార్తీక దీపోత్సవం : మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. కార్తీక మాసంలోనే కార్తీక పౌర్ణమిని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈసారి కార్తీక పౌర్ణమికి అరుదైన శుభ సంఘటనల కలయిక జరుగుతోందని పౌరాణికులు పేర్కొంటున్నారు. గ్రహాల సంయోగంతో అనేక రాజయోగాల నడుమ కార్తీక పౌర్ణమి వచ్చిందనీ, చంద్రుడు మేష రాశిలో, కుజుడు, చంద్రుడు పరస్పరం నాలుగో దశమంలో ఉండటం వల్ల ఈ కార్తీక పౌర్ణమిని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటే ధనయోగం ఏర్పడుతుందని చెబుతున్నారు. కార్తీక పౌర్ణమి రోజు స్నానం, దానం, పూజకు అధిక ప్రాముఖ్యం ఉంటుంది. కాగా, శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలన్నింటినీ విద్యుద్దీపాలతో అలంకరించారు. ముఖ్యంగా శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక పౌర్ణమి శుక్రవారం కూడా కలసిరావడంతో భక్తులు పుణ్య స్నానాల కోసం ఇప్పటికే ఆయా పుణ్యక్షేత్రాలకు చేరుకున్నారు.

**దేవాలయాల్లో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నాం : మంత్రి కొండా సురేఖ**

కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో చేపట్టిన సామూహిక కార్తీక దీపోత్సవం ఆధ్యాత్మిక సౌరభాలను పంచుతున్నదని తెలిపారు. పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి రోజున చేసే దీపారాధన సకల శుభాలను కలిగించారని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.

# 'పోలీస్ ఆఫీసర్‌ను.. నా కారే ఆపుతారా'?

### మధురానగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో రభస

### విధులు అడ్డగించిన సిద్ధిపేట ట్రాఫిక్ ఎసిపి సుమన్‌కుమార్

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త : అతనో పోలీస్ అధికారి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులపై చిందులు తొక్కాడు. నానా రభస చేసి పోలీసు శాఖ పరువును బజారుపాలు చేశాడు! సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సహా మరో ముగ్గురు మంగళవారం రాత్రి సఫారీ కారులో అమీర్‌పేట నుంచి ఎస్ఆర్ నగర్ వైపునకు వెళ్లారు. అక్కడ ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండటాన్ని గమనించారు. వెంటనే తాగి డ్రైవింగ్ చేస్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని పక్కకు ఆపి తన సీటు నుంచి కిందకు దిగి వెనకాల సీటులోకి వెళ్లాడు. వెనకున్న వ్యక్తి డ్రైవింగ్ సీట్లోకి మారాడు. అక్కడే విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ కావేరి ఇదంతా గమనించింది. వెనక సీట్లోని వ్యక్తి డ్రైవింగ్ చేశాడని ఆమె అక్కడున్న అధికారులకు చెప్పారు. తనిఖీల్లో భాగంగా వారి కారును ఆపి వెనుక కూర్చున్న డ్రైవర్‌ను బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు యత్నించారు. అంతలో కారులోని వ్యక్తి కిందకు దిగి తాను సిద్ధిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ అని, తమ కారు వదిలేయాలని హెచ్చరించాడు. కారు నడిపిన జైపాల్ రెడ్డిని వదిలేయాలని బిగ్గరగా కేకలు వేశాడు.బ్రీత్ అనలైజర్ పరీక్షకు డ్రైవర్ మొండికేశాడు. ఊదొద్దని అతనికి ఏసీపీ అడ్డుపడ్డాడు. అక్కడ తనిఖీలు చేసే కానిస్టేబుల్‌ను ఏసీపీ సుమన్ కుమార్ తోసేశాడు. కారు బానెట్‌పై గుద్దుతూ దూషిస్తూ, హల్‌చల్ చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దాంతో ట్రాఫిక్ పోలీసులు మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. కారు నడిపిన జైపాల్ రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు తరలించి బ్రీత్ అనలైజర్ పరీక్షించగా మద్యం తాగినట్లు తేలింది. మోతాదుకు మించి 39 పాయింట్లుగా నమోదైంది. డ్రైవింగ్ చేసిన వ్యక్తి జైపాల్‌రెడ్డి అని, అతడు అల్వాల్‌కు చెందిన వ్యాపారిగా పోలీసులు గుర్తించారు. సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, కారు నడిపిన జైపాల్ రెడ్డి, వారితో పాటు ఉన్న ఎం.శ్రీనివాస్, జి.వెంకట్రావులపై ఎస్ఆర్ నగర్ ట్రాఫిక్ ఎస్సై జి.కాంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు మధురానగర్ పోలీసులు తెలిపారు.

### మా కుటుంబసభ్యులను వెంటనే విడుదల చేయాలి

### మీడియా సమావేశంలో లగచర్ల గ్రామస్తులు

# మాకేం తెలియదు.. మేం ఎవరిపై దాడి చేయలేదు

హైదరాబాద్, నవంబరు 14,ప్రభాతవార్త: తెలంగాణలో వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన సంచలనం సృష్టిస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర రెవెన్యూ సిబ్బందితో గ్రామస్తులు తిరగబడి దాడి చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటన వెనక పొలిటికల్ కుట్ర ఉందని అనుమానిస్తోన్న ప్రభుత్వం లగిచర్ల ఘటనను సీరియస్‌గా తీసుకుని సమగ్ర దర్యాప్తుకు ఆదేశించింది. లగచర్ల ఘటనలో ఇప్పటికే బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు కూడా ఈ ఘటనలో తెరపైకి వచ్చింది. ఈ పరిమాణాల నేపథ్యంలో లగచర్ల గ్రామంలో రాష్ట్రంలో ఒక్కసారిగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామస్తులు మీడియా ముందుకు వచ్చారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. "మా గ్రామానికి ఫార్మా కంపెనీ వస్తుందని ప్రచారం చేశారు. ఫార్మా కంపెనీ పెడితే మా భూములు కోల్పోతాం. మా భూములు లాక్కోవాలని చూస్తున్నారు. మాకు ఫార్మా కంపెనీ వద్దు. ఫార్మా కంపెనీ వలన మాకు రోగాలు వస్తాయి. అసలు కలెక్టర్ మా ఊరికి వస్తున్నాడని మాకు తెలియదు. మేము ఎవరిపై దాడులు చెయ్యలేదు. మాపై, మా కుటుంబాలపై దాడులు చేశారు. పోలీసులు మా కుటుంబ సభ్యులను అరెస్ట్ చేశారు. వాళ్లను వెంటనే విడుదల చెయ్యాలి. మాకు ఏం జరిగిన ఫార్మా కంపెనీ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదు" మా భర్తతో పాటు మా పిల్లలను పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ఇప్పుడు ఏ జైల్లో పెట్టారో కూడా తెలియడం లేదు. మా పెద్ద కొడుక్కి ఉరి శిక్ష వేస్తామని చెప్తున్నారు సార్ అంటూ ఓ మహిళ కన్నీరు పెట్టుకున్నారు.




### రాష్ట్రంలో బిజెపి సంస్థాగత ఎన్నికలలో తలెత్తే వివాదాల పరిష్కారానికి కమిటీ

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: రాష్ట్రంలో బిజెపి సంస్థగత ఎన్నికలలో తలెత్తే వివాదాలను పరిష్కరిస్తుందని రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి ఎండల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ జనతా పార్టీ సంస్థగత ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర పార్టీ సూచన మేరకు రాష్ట్ర పార్టీ అప్పిల్ కమిటీని నియమించిందని తెలిపారు. సీనియర్ నాయకులు చింతా సాంబమూర్తి నాయకత్వంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలవత్, నాగపురి రాజమౌలి, శ్రీనివాస్‌రెడ్డి సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్లు తెలిపారు.

### సిఎం అల్లుడు ఫార్మా కంపెనీ అంటూ హరీశ్, కెటిఆర్ అబద్ధాలు ప్రచారం

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్లుడు ఫార్మా కంపెనీ పెడుతన్నారని హరీష్‌రావు, కెటిఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఒక వేళ అది నిజమని నిరూపిస్తే నేను రాజీనామా చేస్తా అబద్దం అని తేలితే మీరు రాజీనామాచేస్తారా అని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి సవాల్ విసిరారు. సిఎల్‌పి కార్యాయలంయలో గురువారం ఆయన మాట్లాడుతూ సురేష్ అనే వ్యక్తి మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఒకేసారీ ఫోన్‌లో మాట్లాడాడని హరీష్‌రావు అబద్దాలు సురేష్ అనే వ్యక్తి మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి తో ఒకే సారి ఫోన్ లో మాట్లాడాడని హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నాడు..ముఖ్యమంత్రి,కలెక్టర్ ఎవరు వచ్చినా దాడులు చేయాలని రైతులను మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెచ్చగొట్టారని అన్నారు. కెటిఆర్ నరేందర్‌రెడ్డితో కలిసి రాష్ట్రప్రభుత్వంపై కుట్రలు చేశారనిఆయనఅన్నారు. హరీష్‌రావుకొత్తరాగంఅందుకొని ఫార్మాకంపెనీ సిఎం అల్లుడిది అని ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు.

# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

### కేంద్రాన్ని డిమాండ్ చేసిన మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నాయకత్వ శిక్షణ, పరిశోధన, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్లకు శిక్షణనిచ్చే ఈ కేంద్రం వల్ల తెలంగాణాకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. గురువారం నాడు హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇక్కడ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నందున ఎక్సలెన్స్ సెంటర్ వల్ల యువతకు మేలు జరుగుతుందని వెల్లడించారు. నైపుణ్యం ఉన్న ప్రతిభావంతులైన సాఫ్ట్‌వేర్ నిపుణులు, కార్మికులు తెలంగాణాలో అందుబాటులో ఉన్నారని, ఈ విషయంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నామని ఆయన వివరించారు. ముంబయిలో ఏర్పాటు చేసిన తరహాలో రాష్ట్రానికి కూడా ఒక కేంద్రాన్ని కేటాయించాలని ఆయన కోరారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మొదటి మూడు నగరాల్లో హైదరాబాద్ ఒకటని, ఈ సందర్భంగాసిటీ ప్రత్యేకతను వెల్లడించారు. సెమీకండక్టర్ల పరిశ్రమల విషయంలో కేంద్రం తమకు కావాల్సిన ఒక రాష్ట్రానికే ప్రాధాన్యతనిచ్చి హైదరాబాద్ ను విస్మరించిందని ఆయన ఆరోపించారు. ఇక్కడ చిప్ తయారీ పరిశ్రమలకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఆయన గుర్తు చేసారు. వచ్చే సంవత్సరం మొదటి త్రైమాసికంలో రాష్ట్ర ప్రభుత్వం గేమింగ్ పాలసీని విడుదల చేస్తుందన్నారు. గేమింగ్ లో పరిశోధన, అభివృద్ధికి తమ ప్రభుత్వం సహకరిస్తుందని ఆయన వెల్లడించారు. దేశంలోనే అత్యధిక వీక్షకులు ఉన్న యానిమేషన్ సిరీస్ ఛోటా భీమ్, కృష్ణ లాంటివి ఇక్కడే తయారవుతు న్నాయని శ్రీధర్ బాబు చెప్పారు. గేమింగ్‌లో నైతికతకు కట్టుబడి ఉండేలా నిబంధనలు రూపొందిస్తామని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో తమిళనాడు ఐటీ మంత్రి పళనివేల్ తియాగరాజన్ కూడా పాల్గొన్నారు.

# ఫోన్‌ట్యాపింగ్ చేసింది, చేయించింది కెటిఆర్

### నకరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: ఫోన్ ట్యాపింగ్ చేసింది, చేయించింది కెటిఆర్ మాత్రేమ అని గతంలో తనను పార్టీ మారొద్దని ప్రభాకర్‌రావు టేబుల్‌పైవెపన్ పెట్టి బెదిరించాడనినకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు.సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నల్లగొండ డిటిసిలో 1300 మందిని కెటిఆర్ జగదీష్‌రెడ్డి ఆదేశాలతో చిత్రహింసలకు గురిచేశారని ఆవేదన చెందారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్దిని అడ్డుకోవడానికి కెటిఆర్ నీచాతినీచంగా వ్యవహరిస్తూ అధికారులను అక్కసుతో అంతమొందించేందుకు కుట్రలు చేశారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శించారు. మల్లన్న సాగర్ కోసం 12 గ్రామాల ప్రజలను బెదిరించి దౌర్జన్యంగా భూసేకరణ చేసింది మీరు కాదా అని ఆయన ప్రశ్నించారు. బిఆర్ఎస్ పదేళ్ళు అప్రకటిత ఎమర్జెన్సీని మీరు అమలు చేశారని ఆరోపించారు. తెలంగాణ సమాజం ఎన్నటికి బిఆర్ఎస్‌ను క్షమించదని ఆయన అన్నారు. కెటిఆర్ కారణంగా బిఆర్ఎస్ నామరూపాలు లేకుండా పోతుందని ఆయన అన్నారు.

### వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి నిరసనగా ప్రదర్శనలు

### టిఇజెఎసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: ప్రజలకు వివిధ రూపాలలో సేవలు అందించే ఉద్యోగులపై తమ రాజకీయ లక్ష్యాలకోసం భౌతిక దాడులకు దిగటం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ గెజిటెడ్ మరియు ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నాలుగవ తరగతి ఉద్యోగుల, కార్మికుల పెన్షనర్‌ల జేఏసీ మండిపడింది. వికారాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఇతర రెవిన్యూ ఉద్యోగులపై దాడికి నిరసనగా జేఏసీ మరియు ట్రెసా ఇచ్చిన పిలుపు మేరకు లంచ్ అవర్ డెమాన్‌స్ట్రేషన్ లో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని భూపరిపాలన కమీషనర్ కార్యాలయంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం తెలిపారు. దీంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా టీఈజేఏసీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. అత్యంత వెనుకబడిన జిల్లాలో ఒకటైన వికారాబాద్ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు జిల్లా కలెక్టర్ మరియు ఇతర అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే భౌతిక దాడులకు దిగటం ప్రజలను అభివృద్ధికి దూరం చేసే ప్రయత్నమని జేఏసీ నేతలు విమర్శించారు.

దాడికి పాల్పడిన వారిపైనే కాకుండా తెరవెనుక ఉండి రెచ్చగొట్టిన వారు ఎంతటి స్థాయిలో ఉన్నా వారిని కఠినంగా శిక్షించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ నెల 11న వికారాబాదులో జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగులు, టెజిటెడ్ ఆఫీసర్లు, ఉపాద్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్టు జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు.

# టీచర్ పోస్టుల భర్తీలో అవకతవకలపై విచారణ జరిపించాలి

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) రాష్ట్రన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయిన జూనియర్ లెక్చరర్స్ (జేఎల్)కి నియామక పత్రాలను ఇవ్వాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్టు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వేసి 11062 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని.. అయితే ఉపాధ్యాయ పోస్టుల ఎంపికలో పొరపాట్లు జరిగాయని అధికారులు గుర్తించి సర్టిఫికెట్ల పునః పరిశీలన చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో కూడా టీచర్ పోస్టులకు ఎంపికైన వారిలో కొందరు బోగస్ అభ్యర్థులు ఉన్నట్లు అనేకమైన ఫిర్యాదులు రావడంతో అధికారులు ఎంపికైన అభ్యర్థులకి, షార్ట్ లిస్టులోని అభ్యర్థుల సర్టిఫికెట్లను పునఃపరిశీలించాలని షెడ్యూల్ ని జారీచేసిందన్నారు.

ఎంపిక ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవంగా స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ఉండి.. అర్హులైన అభ్యర్థులకు సాంకేతిక సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టుల భర్తీలో ప్రభుత్వం

### జేఎల్ అభ్యర్థులకు వెంటనే నియామకపత్రాలు ఇవ్వాలి

### ప్రభుత్వానికి డివైఎఫ్ఐ డిమాండ్

కొన్ని సబ్జెక్టులకు ఫలితాలను విడుదల చేసి మరికొన్ని సబ్జెక్ట ఫలితాలు విడుదల చేయలేదన్నారు. కొన్ని సబ్జెక్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన నియామక పత్రాలు ఇవ్వకపోవడంతో అభ్యర్థులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని రమేష్, వెంకటేష్ ఆందోలన వ్యక్తం చేశారు. మిగిలిన సబ్జెక్టుల ఫలితాలను కూడా విడుదల చేసి అభ్యర్థులకి పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పాలనలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

### భూములు గుంజుకున్నారు, ఇళ్లు కూలగొడుతున్నారు

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్

హైదరాబాద్, నవంబరు 14, ప్రభాతవార్త: భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతుల నుంచి రూ. 40 లక్షల విలువైన భూమిని కేవలం రూ. 10 లక్షలకే గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అధికారం ఉందని ప్రజల భూములు గుంజుకుంటూ, హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కొడంగల్‌లో ఫార్మా కంపెనీల ఏర్పాటు పేరిట లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచర్ల పరిధిలో సుమారు 1350 ఎకరాలతో పాటు మరో 1500 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించాలని ఆలోచన చేస్తున్నట్లు స్థానిక ప్రజలు భావిస్తున్నారని అన్నారు. అయితే కొంతమంది దళారులు, మధ్యవర్తులు అసైన్డ్ భూములు పొందిన వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారు అన్నారు. మరికొంత మంది పట్టా భూములు కలిగి ఉన్నవారి నుంచి బలవంతంగా భూములు సేకరించాలని ప్రయత్నం చేసిందన్నారు. స్థానిక ప్రజలు తమ గ్రామాలను వదిలిపెట్టే ప్రసక్తి లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంకారంతో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కలెక్టర్ గారిని పంపిస్తే ప్రజలు నిరసన తెలిపారు. స్వయంగా కలెక్టర్ తమపై దాడి చేయలేదని ప్రకటించారు. కానీ 1500 మంది పోలీసులు నాలుగు గ్రామాలపై పడి రాత్రికి రాత్రి కొంతమందిని అరెస్ట్ చేసి హింసించారంటూ మండిపడ్డారు. ఆయా ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు బంద్ చేసి యుద్ధభూమిని తలపించేలా ఓట్లేసి గెలిపించిన ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసిస్తున్నారని అన్నారు. బాధిత ప్రజలు, రైతులకు మద్దతుగా వెళ్లిన ఎంపి డికె అరుణ గారిని పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడిని మాత్రం 50 కార్ల కాన్వాయ్‌తో, 300 మందితో పంపించారు. వారు పల్లెల్లో తిరుగుతూ, ప్రజలను దూషిస్తూ సంతకాలు పెట్టకుంటే మీ పిల్లలు జైళ్లలో మగ్గే పరిస్థితి వస్తుందని భయపెట్టారన్నారు. అధికారులు సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బానిసలుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతంలో ముచ్చర్లలో ఫార్మాసిటీ కోసం హెలికాప్టర్లతో సర్వే చేశారు. రైతుల నుంచి కోట్లాది రూపాయల విలువైన 14 వేల ఎకరాల భూమిని సేకరించారు. చివరకు ఈ భూములను ఫోర్త్ ఎస్టేట్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం వినియోగించుకోవాలని చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఇండ్లు కూలగొడుతోందని, మూసి ప్రక్షాళన పేరుతో వేలకోట్ల దందా చేస్తున్నారన్నారు. ప్రజల నుంచి ప్రభుత్వం భూములు సేకరించాలనుకున్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని, పేద ప్రజలు, రైతుల పక్షాన బిజెపి అండగా ఉంటుంది. ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు దిలీప్ ఆచారి, సునీత, కట్టా సుధాకర్, బిజెపి నాయకులు సుధాకర్ గండే గారు, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



